
పురుషులకు ప్రత్యేకం

# దూరపు కొండలు...



– ఐ.ఏ. నరసింహం

కాంప్లెక్స్ చేరాక రెండు వందల నెంబరు బస్సెక్కి కొత్తగాజువాకలో దిగి బాల చెరువు రోడ్డు వేపు నడక సాగిస్తే ఉడా క్వార్టర్స్ కనిపిస్తాయి. అక్కడ కొచ్చి ఎమ్ ఐ జి 2 ఫిఫ్టీవన్ క్వార్టరుకు పైన వున్న ఎడమ చేతి ప్రక్క పోర్షన్ చక్రధారిది. ఈ ఆనవాలులు సేకరించి భార్యా సమేతంగా బయలు దేరాడు శంకరం.

ఉదయం తొమ్మిది గంటలు దాటింది. ముఖం మీద కందిరీగలు పట్టుపెట్టినట్టున్న ముక్కులో ఇంత నశ్యం దట్టించి, చూపుడు వ్రేలును గాలిలో టప్‌న దులిపి, పై కండువాతో ముక్కు తుడుచుకుని టక్‌టక్ మని తలుపు తట్టాడు.

లోపలనుండి ఏ విధమైన శబ్దం బయటకు రాలేదు.

మళ్లీ తట్టాడు

నో రెస్పాన్స్!

"కొంప తీసి అతగాడి ఇల్లు ఇది కాదేమోనండి" భార్య అంది నీరసంగా.

"అక్షరాలా ఇదే అవుతుందోయ్. ఐనంత సేపు అలస్యమయినా అడ్రసు ప్రకారమే వచ్చాం. సిటీ మనుషులు కదా అంత తొందరగా తలుపులు తెరవరు." అంటూనే మళ్లీ తలుపు తట్టాడు.

"ఎవరు?" లోపలనుండో స్త్రీ గొంతు మూసి వున్న తలుపుల గుండా బయటపడి ఖంగ్ మంది.

"హమ్మయ్య ఇంట్లో ఎవరో వున్నారు. యింక మరి ఫరవాలేదు" అనుకుంటూండగా తలుపు తెరుచుకుంది.

ద్వారం దగ్గర నిల్చున్న ఓ అమ్మాయి దేవుల పల్లి కృష్ణ శాస్త్రి గారన్నట్టుగా ఓ తారామణిహారంలా తళుక్కున మెరిసింది.

"ఎవరండి! ఎవరు కావాలి?" శ్రావ్యమైన ఆ గొంతు సంగీతంలా వినిపించింది.

"అమ్మాయ్ నా పేరు శంకరం. ఈమె నాభార్య భారతి. నేను చక్రధారికి వరుసకు బాబాయ్ నవుతాను - ఉన్నాడా బడుధ్ధాయ్? ఔనూ నువ్వు అతగాడికి......" అర్ధోక్తిలో ఆగిపోయాడుశంకరం.

"శ్రీమతినేనండి! రండి లోపలకు. ఇవాళ ఆఫీసుకు శలవు. ఆయనిప్పుడే బయట కెళ్లారు ఓ పది నిముషాల్లో వచ్చేస్తారు." అంటూ స్వాగతం పలికిందామె.

ఇద్దరూ లోపలకు ప్రవేశించారు.

"ఇల్లు చాలా బాగుందమ్మా - కానీ సిటీ నుండి దూరంగా విసిరి పారేసినట్టు ఈ మూలనున్నారేమిటి?" అన్నాడు శంకరం.

ఆ అమ్మాయి ముసి ముసిగా నవ్వుకుంది. కానీ ఏసమాధానం చెప్పలేదు.

"పిల్లకు గొప్ప బిడియంలా వుందికదూ" భార్య వేపు తిరిగి అన్నాడు శంకరం

"ఐనా ఇంట్లోకి ప్రవేశిస్తూనే అదేం చచ్చు ప్రశ్న?" భారతి గొణిగింది చెవిలో.

"ఫరవా లేదు లేవోయ్ మరి ఏదో మాట్లాడాలి కదా అందుకే అలా అన్నాను. ఐనా మన మెవరిమో చక్రధారికి తప్ప ఈమెకు పూర్తిగా తెలీదు కదా...."

అంటూండగా లోపలకు ప్రవేశించాడు చక్రధారి.

"హలో చక్రి!" శంకరం అప్యాయంగా పలకరించాడు.

"ఏం బాబు కులాసాగా వున్నావా?" భారతి అందుకుంది.

"కులాసాగానే వున్నానండి. సారీ - మీరు .... మీరెవరో నేను గుర్తు పట్ట లేక పోతున్నాను." అన్నాడు చక్రధారి నీళ్లునములుతూ

"అయ్యో అయ్యో అబ్బాయి అలా అంటున్నాడేమిటండి!" భారతి భారంగా అడిగింది శంకరాన్ని.

"అబ్బ నువ్వాగవే - అయ్యో అలా అంటావేమిటబ్బాయ్ నన్ను..... నన్ను నువ్వు గుర్తు పట్టలేదా....... ఔనా?......" అన్నాడు శంకరం.

"ఔనూ...." చక్కధారికి అప్పటికీ అతనెవరో తెలిసి రాలేనట్టుంది. మెడ గిల్లుకున్నాడు.

"ఇహ మరింకనేం. మీ నాన్నా నేనూ

గుమ్మలక్ష్మీపురంలో ఓ మండలాఫీసులో పని చేశాం. ఇద్దరిదీ పక్క పక్కనే ఇళ్లు. నువ్వు రోజూ మీనాన్న గారినడిగి పేపరు తెచ్చినాకిచ్చేవాడివి కదా......

గుర్తొచ్చిందా!" అన్నాడు శంకరం.

ఓ రెండు నిముషాల తరువాత,

"ఓహ్! మీరా పేపరు బాబాయ్ ఏమిటి? ఏమిటి మీరిలా వచ్చారు? ....... ఇప్పుడెక్కడుంటున్నారు?" వెంటనే తను కూర్చున్న సోఫాలో మరో పక్క కూర్చుంటూనే అడిగాడు చక్రధారి.

"చెప్తానోయ్ అన్నీ చెప్తాను. నువ్వు నన్ను గుర్తు పట్టగలిగావ్ కదా - ఇంక తీరిగ్గా మాట్లాడు కుందాం." అన్నాడు శంకరం.

ఓ పావు గంట గడిచింది.

చక్రధారి శ్రీమతి రేణుక - "కాఫీ తీసుకోండి!" అంటూ ట్రేతో ప్రత్యక్షమయింది.

"అ! అవునూ నువ్వెసిటీలో వుద్యోగం చేస్తూ పెళ్లి కూడా చేసేసుకుని హేపీగా వుంటున్నా వన్న మాట. ఏమోయ్ నీ పెళ్లికి నా అడ్రసు - తెలుసుకుని ఓ శుభ లేఖన్నా పంపలేక పోయావేం! రెక్కలు కట్టుకు వచ్చి ఆశీర్వదించి మరీ వెళ్లేవాడిని కదా..... అసలు నిన్నని ప్రయోజనం లేదులే. మీ నాన్న నడగాలా మాట.... ఈ క్షణంలో ఇక్కడే వుండి వుంటే దుయ్యబట్టి వదిలేవాడిని." శంకరం దెప్పిపొడిచాడు.

"నిజమే బాబాయ్. తప్పయి పోయింది. కానీ ఏం చేస్తాం - నా పెళ్లి కూడా చాలా తక్కువ వ్యవధిలోనే జరిగి పోయింది. సరే. ఏమిటి మీరిలా వచ్చారు? మా అడ్రసు మీకెలా దొరికింది?" అన్నాడు చక్రధారి.

"మనసుంటే మార్గంవుండ దటోయ్ - మేమీ వూరికి ఓ మూడ్రోజులు పని మీద వచ్చాం. నువ్విక్కడే వుంటున్నట్టు తెలిసి సంతోషించాను. యింక వేరే చోట ఎందుకులే అని ఇలా బయలు దేరాను. మీ పిన్నికి విశాఖ సిటీ తెలీదట. అలా ఓ సారి తిప్పి సింహాద్రప్పన్న దర్శనం చేసి బయలు దేరిపోతాం" అన్నాడు శంకరం.

గుండె జారిపోయింది చక్రధారికి.

"ఔను నేను ఖచ్చితంగా అడుగుతున్నానని ఏమీ అనుకోవద్దు. మీ యింట్లో ఈ మూడు రోజులూ వుండటానికి మీకేం అభ్యంతరం లేదుకదా" అన్నాడు శంకరం చమత్కారంగా.

"అబ్బే - మాకేం అభ్యంతరం లేదు.లేకపోతే - మీరే మా ద్వారా కొంచం ఇబ్బందికి గురౌతారేమో. ఇది మహా నగరం అన్నమాటే గానీ మంచి నీళ్లకు కూడా క్యూలోనే నిల్చోవాల్సి వుంటుంది. అదే నా బాధ." అన్నాడు చక్రధారి లౌక్యంగా.

"ఓ హ్ అదా - ఫరవా లేదు లేవోయ్ మేం ఏ ఎండకా గొడుగు పట్టే మనుషులం. మీరు పెట్టింది తిని పడుకోమన్న చోట పడుకుంటాం, అవసరం కోసం వచ్చిన వాళ్లం. ఆతిథ్యాలు స్వీకరించడానికి కాదు కదా....." అన్నాడు శంకరం.

మధ్యాహ్నం పన్నెండు గంటల వరకూ అమాట ఈమాటా చెప్తూ శంకరం చక్రధారికి మరింత దగ్గరయ్యే ప్రయత్నంలో తెగ హైరానా పడిపోతున్నాడు.

"భోజనం రెడీ - అందరూ వచ్చేస్తారా?" రేణుక పిల్చింది.

"ఏమిటోయ్ చక్రి. శతం విహాయ భోక్తవ్యం అన్న పదానికి అర్థం బాగా తెలిసినట్టుంది. నీశ్రమతికి. అప్పుడే భోజనం అంటుందేమిటి?" అన్నాడు శంకరం.

"టైమయింది కదా బాబాయ్ - బైట కుండీలో నీళ్లున్నాయి. కాళ్లు కడుక్కుని వచ్చెయ్యండి, కలిసి భోంచేద్దాం." అన్నాడు చక్రధారి యాంత్రికంగా.

"ఓ పది నిముషాల తరువాత డైనింగ్ టేబులు దగ్గర కుర్చీలో కూర్చుంటూనే - "మీ నాన్న యిప్పుడెక్కడున్నాడోయ్. నన్ను పూర్తిగా మరిచిపోయే వుంటాడు. కులాసానా...." అన్నాడు శంకరం.

"మానాన్న గారి ఆరోగ్యం ఏమంతబాగా లేదు బాబాయ్. తమ్ముడికి హైదరాబాద్ లోనే జాబ్ వచ్చింది. అక్కడే వున్నారు నాన్న -, అమ్మ" అన్నాడు చక్రధారి.

"చాలా సంతోషమోయ్. మొత్తానికి మీరిద్దరూ ప్రయోజకులైనారన్నమాట. విశ్వనాథం అదృష్టవంతుడే" అన్నాడు శంకరం అన్నంలో కందిపప్పు కలుపు కుంటూనే.

"కొంచం నెయ్యి వెయ్య మంటారా? - మామయ్యగారూ!" సరిగ్గా అప్పుడే అడిగింది -రేణుక

అఖర్లేదని చెప్తూనే - "వంటలు - అద్భుతంగా వున్నాయి తల్లీ" అన్నాడు శంకరం

తరువాత మరేదో సంభాషణలతో భోజనం ముగించా రందరూ

మధ్యాహ్నం మూడు - నాలుగు గంటల మధ్య

చక్రధారి బయటకు వెళ్లాడు.

రేణుక మరో గదిలో ఏదో పనిలో వుంది.

"ఏమండోయ్" సన్నగా అంది భారతి.

బైట వరండాలో ఐరన్ కాట్ మీద నడుం వాల్చి పేపరు చూస్తున్న శంకరం తలెత్తి ఆమె వేపు చూసి "ఏమిటి?" అన్నాడు.

చెప్పిందామె.

ఆశ్చర్య పోయాడు శంకరం

తరువాతిద్దరూ ఏదో గుసగుసలాడు కున్నారు.

భారతి ముఖం దిగాలుగా వుంది. శంకరం ఆమెను ఓదార్చే ప్రయత్నంలో "సరే సరే - జరిగిందెలాగో జరిగింది. తరువాత ఆలోచిద్దాం. ఫరవాలేదు మనమేం ఇబ్బంది పడం" అన్నాడు.

భారతి మళ్లీ ఇంట్లోకి వెళ్లిపోయింది.

*****

"అబ్బాయ్ చక్రధారీ. నువ్వాఫీసుకు బయలు దేరిపోతున్న ట్టున్నావ్. ఏదో నీ సహాయ సహకారాల వల్ల ఈ మూడు రోజుల్లో నా పనులు పూర్తి చేసుకోవటమే కాకుండా అందమైన విశాఖ సిటీ చూడ్డం, సింహాచలం వెళ్లడం అయింది. మేమీ రోజు బయలు దేరి అలా ఒక సారి కనక మహాలక్ష్మి గుడికి వెళ్లి యింటికి పోతాం." అన్నాడు శంకరం.

చక్రధారి ఆనందానికి అవధులు లేకపోయాయి. వెంటనే ఓసన్న పాటినవ్వును ప్రదర్శించాడు. రేణుక భారతికి బొట్టు పెట్టింది. శంకరం దంపతులు గుమ్మందాటారు. ఓ వారం రోజుల తరువాత - "పోస్ట్" అన్న కేకతో వుత్తరం అందుకుని చింపి చదవడం ప్రారంభించాడు శంకరం.

"బాబాయ్ గారికి నమస్కారం! మీరు గత వారం మాయింటి కొచ్చారు. దూరపు కొండ లునునుపు అన్న సామెతలో సారాంశాన్ని మీరు అవగాహన చేసుకోలేక పోయినందుకు చింతిస్తున్నాను.

బైట జనాలు సిటీ వుద్యోగిని చూసి అసూయ పడతారేమో గానీ, అవుద్యోగి మాత్రం ఆసిటీని విడిచి బైట జనాల్లో కలిసి పోవాలని అనుక్షణం కొట్టుకుంటూంటాడు. ఇది అక్షరసత్యం.

నేనీ సిటీ లో ఉద్యోగం పేరుతో వచ్చిన వారానికే మా యిల్లు చుట్టాలు, స్నేహితులతో నిండి పోయింది.

యూనివర్సిటీ పనుందని ఒకరూ, కె.జి.హెచ్ లో ఆపరేషన్ వుందని ఇంకొకరు, నాటకవితలు ఆకాశవాణిలో బ్రాడ్ కాస్ట్ కాబోతున్నాయి రికార్డింగ్ కోసం అని మరొకరూ ......... ఇలా రకరకాల పనుల మీద రకరకాల స్నేహితులు మా అడ్రసు కనుక్కుని వచ్చి వెళ్తున్నారు. ఈ తాకిడికి తట్టుకో లేక కొన్నాళ్ల పాటు ఇళ్లు మారుతూ వచ్చాం కానీ ప్రయోజనం లేకపోతోంది.

ఇక్కడో విషయం -

ఎక్కడో బీరకాయ పీచులాంటి బంధుత్వాన్ని ఆసరాగా తీసుకుని వారియింట చేరి పనులు నెర వేర్చుకోవచ్చు ననే ఆలోచన కంటే హాయిగా ఏలాడ్జీలోనో దిగి స్వేచ్ఛగా వుండొచ్చును కదా - ఆ యింగిత జ్ఞానం అందరిలా మీకూ ఎందుకు లేకపోయిందా అన్నదే నా బాధ.

నిజానికి ఈ సిటీ పెద్దదే కానీ నాది మాత్రం చిన్నవుద్యోగమే,ఈ చిన్న ఆధారంతో రోజు రోజుకీ పెరిగి పోతున్న జీవన భారంతో బ్రతుకు బండిని ముక్కుతూ మూల్గుతూ ఈడ్చుకొస్తున్నాం.

యిక అసలు విషయానికి వస్తున్నాను.

మీరు వస్తే కాదన లేక మీరు ఉంటా మంటే పొమ్మన లేక ఈసారి నేను ఇరుకునపడిపోయాను.

ఇకపోతే -

నన్ను నేను ఈ సారి రక్షించుకునే మార్గం మరొకటి కనబడక, మీరు మూడు రోజులూ మాయింట వున్నందుకు అయిన ఖర్చులకుగాను మీ బేగులో నుండి ఓ రెండు వందల రూపాయలు తీసుకున్నాను.

నన్ను తప్పుగా అర్థం చేసుకోరు కదూ

శలవ్

మీ

చక్రధారి

అంతే -

ఆ వుత్తరం చదివి నీరు గారిపోయాడు. శంకరం.